# నమస్తే తెలంగాణ
## ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్, శనివారం 31 మే 2025 | ADILABAD NIRMAL


## తడిసిన ధాన్యాన్ని కొనాలి

- బీఆర్ఎస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకిషన్‌రెడ్డి



జామ్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకిషన్‌రెడ్డి

సారంగాపూర్, మే 30 : అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొరిపెల్లి రాంకిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జామ్, యాకర్‌పెల్లి, సారంగాపూర్ గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం, జొన్నల కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అధికంగా ఉన్న దృష్ట్యా కలెక్టర్, జేసీల దృష్టికి తీసుకెళ్లి.. రెండు, మూడు రోజుల్లో ధాన్యాన్ని కొనుగోలు చేయిస్తామన్నారు. చేయకుంటే బీఆర్ఎస్ పార్టీ తరపున పోరాటం చేస్తామన్నారు. ఇందులో బీఆర్ఎస్ పార్టీ నాయకులు జీవన్‌రావు, దేవిశంకర్, లక్ష్మీనారాయణగౌడ్, లక్ష్మణ్, వెంకట్, శ్రీధర్, భోజారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎకిలేరి భోజన్న, నరేశ్, గట్టు గంగాధర్, బోసాని భోజన్న, చిన్నోల్ల నర్సయ్య, గడ్డల చిన్నయ్య, సాకలి చిన్నయ్య, పవార్ రాజు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

## భక్తి మార్గంతోనే మోక్ష మార్గం

నేరడిగొండ, మే 30 : భక్తి మార్గంతోనే మోక్ష మార్గం లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శుక్రవారం వడూర్‌లో నూతనంగా నిర్మించిన ముత్యాల పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భక్తి మార్గంలో వెళితే మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రీతంరెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, గ్రామస్తులు గాదె శంకర్, రాములు, భూషణ్, ఫయాజ్, నవీన్, రామకృష్ణ, ఉప్పు పోశెట్టి పాల్గొన్నారు.

- తమ్ముడిని బరిలో దింపేందుకు సిద్ధమైన మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్సార్
- కాసిపేట మాజీ ఎంపీపీ విక్రమరావును బలపరిచిన మిగిలిన ముగ్గురు ఎమ్మెల్యేలు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్‌లో తారాస్థాయికి వర్గవిభేదాలు

రెండు వర్గాలుగా చీలిపోయిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

# ఓరియంట్ ఎన్నికల కాక







మంచిర్యాల జిల్లా కాసిపేటలోని ఓరియంట్ సిమెంట్ కంపెనీ

మంచిర్యాల, మే30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు తారాస్థాయికి చేరింది. ఇప్పటికే ముగ్గురు ఎమ్మెల్యేలు మంత్రి పదవికోసం పట్టుబడుతుండగా, తాజాగా ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికల్లోనూ తమ సన్నిహితులను బరిలో దింపేందుకు పోటీ పడడం చర్చనీయాంశమవుతున్నది. బెల్లంపల్లి, చెన్నూర్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు ఒక్కటై కాసిపేట మాజీ ఎంపీపీ విక్రమ్‌రావును బలపరుస్తుండగా, ఎమ్మెల్యే పీఎస్సార్ మాత్రం తన తమ్ముడు సత్యపాల్‌ను బరిలో దింపేందుకు ఆసక్తి చూపడం గందరగోళానికి దారితీస్తున్నది.

### మంత్రి పదవి కోసం పోటాపోటీ

జిల్లా నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన నలుగురు నాయకుల మధ్య సఖ్యత లోపించింది. మంచిర్యాల జిల్లాకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు మంత్రిపదవి కోసం పట్టుబడుతుండగా, ఒకరంటే ఒకరికి పడటం లేదు. బహిరంగంగానే విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకుంటుండగా, ఆ పార్టీ గందరగోళం నెలకొంటుంది. పార్టీ కోసం కష్టపడ్డానని.. తనకే గుర్తింపు ఇవ్వాలని, తనకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని ఇటీవల జరిగిన బహిరంగ సభలో మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబుల సమక్షంలో మంచిర్యాల ఎమ్మెల్యే మాట్లాడారు. నిన్న..మొన్న పార్టీలోకి వచ్చిన వారికి పదవులు ఇవ్వొద్దని, ఒకే కుటుంబానికి మూడు పదవులు ఎలా ఇస్తారంటూ.. కాకా కుటుంబాన్ని ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. అదే స్థాయిలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌లు సైతం స్పందించారు. కాంగ్రెస్ పార్టీతో తమ కుటుంబానిది విడదీయరాని అనుబంధమని బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ అంటే.. బీజేపీలో ఉంటే కేంద్రంలో పదవి వచ్చేదని, తనను కాంగ్రెస్‌లోకి సీఎం రేవంత్‌రెడ్డి రమ్మంటేనే వచ్చానని.. మంత్రి పదవిపై హామీ ఉందని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ కౌంటర్ ఇచ్చారు. గతంలో జరిగిన ఈ వ్యవహారం కాంగ్రెస్ పార్టీలో వర్గపోరును బహిర్గతం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మంచిర్యాల ఎమ్మెల్యేల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. మంత్రి పదవి విషయంలో ముగ్గురు ఎమ్మెల్యేల మధ్య పోటీ నెలకొంది. రాష్ట్ర స్థాయి నుంచి మొదలుపెడితే కేంద్రస్థాయి దాకా ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. మంత్రి పదవి మాకే కావాలంటూ పట్టుబడుతున్నారు. ఈ క్రమంలో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ గాడి తప్పిపోయింది. ప్రతి విషయంలో ఎమ్మెల్యేలు తమ ఆధిపత్యాన్ని చాటుకునేందుకు పోటీ పడుతున్నారు. మొన్నటికి మొన్న ఎంపీ వంశీకృష్ణ వర్గాన్ని మంచిర్యాలలో నిరసన తెలపకుండా పీఎస్సార్ వర్గం నాయకులు అడ్డుకున్నారు.

### ఓరియంట్ ఎన్నికల కోసం పోటాపోటీ..

తాజాగా ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికల కోసం గడ్డం వివేక్, వినోద్ ఒక్కటయ్యారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మాబొజ్జుతో కలిసి కాసిపేట మాజీ ఎంపీపీ విక్రమ్‌రావును బలపరుస్తున్నట్లు బెల్లంపల్లిలో శుక్రవారం ప్రెస్‌మీట్ పెట్టి మరీ ప్రకటించారు. కాగా, ఇదే గుర్తింపు సంఘం ఎన్నికల కోసం మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తన తమ్ముడు సత్యపాల్‌రావును బరిలోకి దించనున్నారు. దీంతో మరోసారి జిల్లా కాంగ్రెస్ పార్టీలో నాయకుల మధ్య జరుగుతున్న ఆధిపత్యపోరు బహిర్గతమైంది. కాంగ్రెస్ పార్టీలో మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ సైతం ఓరియంట్ సిమెంట్ ఫ్యాక్టరీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతుంది. దీంతో ఒక్క కాంగ్రెస్ పార్టీ నుంచే మూడు వర్గాలు పోటీలో నిలవనుండడంతో ఏం జరుగుతుందో అనేది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

### ఒక్కటైన ముగ్గురు.. ఒంటరైన పీఎస్సార్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిందే నలుగురు ఎమ్మెల్యేలు. అందులో ముగ్గురు మంచిర్యాల జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తుంటే.. నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం నుంచి వెడ్మా బొజ్జు అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నారు. మంత్రి పదవి విషయంలో మంచిర్యాల జిల్లాకు చెందిన ముగ్గురు నాయకులు ఎవరికి వారు తీవ్రప్రయత్నాలు చేస్తూ వర్గాలుగా విడిపోయారు. ఓరియంట్ గుర్తింపు సంఘం ఎన్నికల కోసం ఈ నలుగురు ఎమ్మెల్యేలు రెండుగా చీలిపోయారు. బెల్లంపల్లి, చెన్నూర్ ఎమ్మెల్యేలు వినోద్, వివేక్‌తో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు జతకట్టారు. ముగ్గురు కలిసి ఓ అభ్యర్థిని బలపరిచారు. దీంతో పీఎస్సార్ ఒంటరైపోయారు. ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం ఇది హాట్‌టాపిక్‌గా మారింది. మంత్రి పదవి విషయంలోనూ బొజ్జు గడ్డం ఫ్యామిలీకే సపోర్ట్ చేస్తున్నారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మంచిర్యాల జిల్లాలో ఉన్న ఓరియంట్ సిమెంట్ ఫ్యాక్టరీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి అభ్యర్థిని నిలబెట్టాల్సి వస్తే నలుగురు ఎమ్మెల్యేలు కలిసి ఒకరిని నిలబెట్టాలి. అలా కాకుండా ముగ్గురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ నుంచి ఓ వ్యక్తిని బలపరుస్తున్నట్లు ప్రకటించారు. డీసీసీ అధ్యక్షురాలిగా పీఎస్సార్ భార్య కొక్కిరాల సురేఖ ఉండగా.. ఆమెతో గానీ, మంచిర్యాల ఎమ్మెల్యేగానీ సంబంధం లేకుండా ముగ్గురు ఎమ్మెల్యేలు ప్రకటన చేయడం హస్తం పార్టీలో కలకలం రేపుతున్నది. దీనిపై పీఎస్సార్ ఎలా స్పందిస్తారన్నది తీవ్రచర్చనీయాంశంగా మారింది.

### జూన్ 5న సమావేశం..

దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికలపై లేబర్ కమిషన్ కసరత్తు మొదలుపెట్టింది. ఈ నెల 5న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఉదయం 11 గంటలకు అన్ని యూనియన్లతో సమావేశం కానున్నది. అన్ని యూనియన్ల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని ఎన్నికల తేదీలను పరిశీలించే అవకాశాలు ఉన్నాయి. వాస్తవానికి కొన్ని నెలల క్రితమే ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, ఓరియంట్ సిమెంట్ కంపెనీని అదానీ గ్రూప్ కొనుగోలు చేసింది. యాజమాన్యం మార్పు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఎన్నికలు వాయిదా వేశారు. తాజాగా హైకోర్టు ఆదేశాలను లేబర్ కమిషన్ ఎన్నికలకు కసరత్తు మొదలుపెట్టింది. జూన్ 5న జరిగే మీటింగ్‌తో ఎన్నికలపై క్లారిటీ రానున్నది.



ముథోల్‌లో బాసర-భైంసా రహదారిపై ధర్నా చేస్తున్న దళిత సంఘం నాయకులు

## బుద్ధుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి

- బాసర-భైంసా రహదారిపై రాస్తారోకో
- 4 గంటలు కొనసాగిన ఆందోళన

ముథోల్, మే 30 : ముథోల్ మండలంలోని బోరిగాం గ్రామంలో యథావిధిగా బుద్ధుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని శుక్రవారం దళిత సంఘం నాయకులు ఛలో బోరిగాంకు పిలుపునిచ్చారు. దీంతో పోలీసులు బోరిగాం గ్రామం వైపు వెళ్లకుండా పికెటింగ్‌తోపాటు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలం 249 సర్వే నంబరులో తొలగించిన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో ముథోల్‌లోని బాసర-భైంసా రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు నిజామాబాద్, భైంసా, ముథోల్ ప్రాంతాలకు చెందిన దళిత సంఘాల నాయకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్రభుత్వ భూమిలో బుద్ధ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తే ధర్నా విరమిస్తామని, లేదంటే విరమించే ప్రసక్తే లేదని భీష్మించుకుని కూర్చోవడంతో నాలుగు గంటలు వాహనాలు ఆగిపోయాయి.

నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల నచ్చజెప్పినప్పటికీ ధర్నా కొనసాగింది. అయితే అనంతరం ఆర్డీవో కోమల్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని వారిని సముదాయించే ప్రయత్నం చేసినప్పటికీ వినలేదు. తమకు న్యాయం జరిగే వరకు కదిలేది లేదని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పది రోజుల్లో ప్రభుత్వంతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించడంతోపాటు కాంస్య విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి నిధులు వచ్చే విధంగా చూస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

## బాసర భక్తజన సంద్రం

బాసర, మే 30 : బాసర సరస్వతీ అమ్మవారి క్షేత్రం శుక్రవారం భక్తులమయమైంది. అమ్మవారి రోజైన శుక్రవారం కావడంతోపాటు సెలవులు ముగుస్తుండడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అమ్మవారి క్షేత్రానికి పోటెత్తారు. భక్తుల రద్దీ వల్ల క్యూలైన్‌లలో భక్తులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అక్షరాభ్యాస మండపాలు భక్తులతో కిక్కిరిశాయి. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయం ఆవరణ, క్యూలైన్‌లు, ప్రసాదాల కౌంటర్‌లు, గోదావరి వద్ద, బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో జన సంద్రం కనిపించింది. అయితే బస్సులు సమయానికి రాక పోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు.



ఆదిలాబాద్ మార్కెట్ యార్డు బయట జొన్నల లోడ్‌తో వాహనాలు



మార్కెట్ యార్డులో జొన్నలు ఆరబెడుతున్న రైతు



అమ్మవారి ఆలయం ఆవరణలో భక్తుల రద్దీ

# కొనుగోళ్లు బంద్

- నేటితో ముగియనున్న గడువు
- జొన్న పంట సేకరణలో జాప్యం
- వర్షాలతో అన్నదాతల ఇబ్బందులు
- సమయం పెంచాలని వేడుకోలు

ఆదిలాబాద్, మే 30(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో జొన్న కొనుగోళ్లు నేటి(శనివారం)తో ముగియనున్నాయి. మార్కెట్‌లో కొనుగోలు చేసిన సంచుల రవాణాలో జాప్యం, గన్నీ బ్యాగుల కొరత, వర్షాల కారణంగా పలుమార్లు కొనుగోళ్లలో అంతరాయం కలిగింది. యాసంగిలో జిల్లా వ్యాప్తంగా రైతులు 1.10 లక్షల ఎకరాల్లో జొన్నలను సాగు చేశారు. ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. 12 కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రాథమిక సహకార సంఘాల ద్వారా పంటను సేకరించారు. ప్రైవేటు వ్యాపారులు క్వింటాలుకు రూ. 2,600తో కొనుగోలు చేస్తుండడంతో రైతులు ప్రభుత్వ కేంద్రాల్లో మద్దతు ధర క్వింటాలుకు రూ.3371తో విక్రయించారు. జిల్లా వ్యాప్తంగా 5.20 లక్షల క్వింటాళ్ల పంటను కొనుగోలు చేశారు.

### రైతుల వద్ద నిల్వలు

యాసంగిలో సాగు చేసిన జొన్న కోతలు పలు గ్రామాల్లో పూర్తి కాలేదు. వారం రోజులుగా వర్షాలు పడుతుండడంతో పొలాల్లో తడసిపోతున్నది. పలు కారణాలతో కొనుగోలు కేంద్రాలకు సెలవులు ప్రకటించడంతో రైతులు పంటను విక్రయించ లేదు. వర్షాలతో తేమ శాతం పెరగడంతో కేంద్రాల నిర్వాహకులు పంటను తీసుకోవడం లేదు. దీంతో రైతులు పంటను విక్రయించడంలో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. రైతుల వద్ద ఇంకా పంట నిల్వలు ఉండగా.. నేటితో కొనుగోళ్లు ముగియనున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేటు వ్యాపారులు మద్దతు ధర కంటే రూ.800 తక్కువకు పంటను కొనుగోలు చేస్తుండడంతో వారికి అమ్మితే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందంటున్నారు. అధికారులు స్పందించి కొనుగోళ్ల గడువును పెంచాలని కోరుతున్నారు.

### కొనుగోలు గడువు పెంచాలి..



*నేను ఏడెకరాల్లో జొన్న సాగు చేశా. వాతావరణ పరిస్థితుల కారణంగా పంటను తీయడంలో ఆలస్యం అయింది. ఎకరాకు 18 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశాలున్నాయి. ఇప్పుడు పంట తీస్తే తేమ ఎక్కువగా ఉంటుంది. వర్షాల కారణంగా హార్వెస్టర్‌ల ద్వారా పంటను తీసే అవకాశం లేకుండా పోతుంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో తీసినా కొనుగోలు కేంద్రాల సిబ్బంది జొన్నలను కొనుగోలు చేయడానికి నిరాకరిస్తారు. రోజు వర్షం పడుతుండడంతో ఎండబెట్టే అవకాశం లేదు. అధికారులు స్పందించి జొన్నల కొనుగోళ్ల గడువును మరో పది రోజుల వరకు పెంచాలి.*

**- సుభాష్, రైతు, మావల**

### నాలుగు రోజుల నుంచి మార్కెట్‌లో ఉంటున్నా..



*నేను 40 క్వింటాళ్ల జొన్నలను ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు అమ్మడానికి తీసుకొచ్చి నాలుగు రోజులు అవుతుంది. తేమ ఎక్కువ ఉందని కొనుగోలు కేంద్రాల సిబ్బంది తీసుకోలేదు. ఎండబెట్టాలని సూచించారు. దీంతో షెడ్డులో ఉన్న జొన్నలను కిందికి దించి ఎండపెడుతున్నా. నిన్న పడిన వర్షానికి పంట తడిసింది. ఎండలు లేకపోవడంతో తేమ శాతం తగ్గడం లేదు. నాలుగు రోజుల నుంచి ఎండపెడుతున్నా కొనుగోలు చేయడం లేదు. రైతులు ఇబ్బందులు పడకుండాఅధికారులు జొన్నలు కొనుగోలు చేయాలి.*

**- సునీల్, రైతు, తర్నం, భోరజ్**

## అసభ్యకరంగా ప్రవర్తించిన క్షుద్ర మాంత్రికుడి అరెస్ట్



అభినయ్ కుమార్‌ను అరెస్ట్ చేసిన వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్

ఎదులాపురం, మే 30 : క్షుద్ర పూజల పేరిట మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించిన క్షుద్ర మాంత్రికుడిని అరెస్ట్ చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ సునీల్‌కుమార్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. బ్రాహ్మణవాడకు చెందిన మహిళకు అనారోగ్య సమస్యలు ఉన్నాయి. దీంతో అదే కాలనీకి చెందిన రమేశ్ మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా సక్రాని గ్రామానికి చెందిన క్షుద్ర మాంత్రికుడు అభినయ్ కుమార్ గురించి బాధిత కుటుంబ సభ్యులకు చెప్పాడు. బాధిత మహిళకు నాగదోషం ఉందని, క్షుద్ర పూజలు చేయాలని బాధితులకు అభినయ్ కుమార్ నమ్మ పలికాడు. అయితే శుక్రవారం బాధితురాలి ఇంట్లో క్షుద్ర పూజలు చేయాల్సి ఉంటుందన్నారు. గదిలో మహిళను ఒంటరిగా ఉంచి, కుటుంబ సభ్యులను బయటకు వెళ్లాలన్నాడు. గదిలో నుంచి కొద్దిసేపటికే మహిళ కేకలు వినబడిన వెంటనే కుటుంబ సభ్యులు లోపలికి వెళ్లిన సందర్భంలో మహిళపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు అభినయ్ కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

నిర్మల్ అర్బన్, మే 30 : నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం నిర్మల్ పట్టణంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాలు, పురుగుల మందుల ప్యాకింగ్, లేబుల్లు, అమ్మకాల రిజిస్టర్‌లో స్టాక్ నిల్వలను పరిశీలించారు. ఆమె వెంట వ్యవసాయ అధికారి రాజశేఖర్, తహసీల్దార్ రాజు ఉన్నారు.

## కూలీ డబ్బులు చెల్లించాలని ధర్నా

ఎదులాపురం, మే 30 : పెండింగ్‌లో ఉన్న కూలీ వేతనాలతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలు ఆందోళనకు దిగారు. ఈ మేరకు శుక్రవారం వారు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. వీరికి ఆదివాసీ గిరిజన సంఘం మద్దతుగా నిలిచింది. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లంకా రాఘవులు మాట్లాడుతూ.. కూలీ డబ్బులు వారాల తరబడి చెల్లించక పోవడంతో కుటుంబాలను పోషించుకోవడం భారంగా మారుతోందన్నారు. పనిస్థలాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, నిరుపేదల భూములకు పట్టాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు రూ.లక్ష డిపాజిట్ నిబంధన తొలగించి అడ్వాన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డులతోపాటు పెంచిన పెన్షన్‌ను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వామి, ఆశన్న, సక్కు, గంగారాం, అరవింద్, కోవ శకుంతల, ఆరిఫా, మాధవ్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సంఘం సభ్యులు